

సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 31 । ఆగస్టు । 2023



కనరో భాగ్యము..

నేడు హరికథా పితామహుడు ఆదిభట్ల జయంతి. సిక్కోలులో హరికథకులు ప్రోత్సాహం కోరుతున్నారు. - 8లో



మద్యానికి బానిసై..

మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోటబొమ్మాళిలో ఘటన జరిగింది. - 8లో

12 వేల జీవాలకు ఆరోగ్య సంరక్షణ కార్డులు

కోటబొమ్మాళి: జిల్లావ్యాప్తంగా 12వేల గొర్రెలు, మేకలకు ఆరోగ్య సంరక్షణ కార్డులు మంజూరైనట్లు పశు సంవర్ధక శాఖ జేడీ ఎం.కిశోర్ తెలిపారు. కోటబొమ్మాళి పశువైద్య కేంద్రాన్ని ఆయన బుధవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆరోగ్య సంరక్షణ కార్డులను సంబంధిత రైతులకు ఆర్‌బీకేల వెటర్నరీ అసిస్టెంట్ల పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు నేటి ఉదయం 10 గంటల నుంచి జెడ్పీ సమావేశ మందిరంలో జరుగనున్నాయి. ఈ మేరకు జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారులందరికీ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచనలు జారీ అయ్యాయి. అలాగే ఉదయం నుంచి సాయంత్రం వరకు మొత్తం 7 స్థాయీ సంఘ సమావేశాలకు ప్రజాప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో ఆయా స్థాయి సంఘ సభ్యులతో పాటు అధికారులు కూడా హాజరుకానున్నారు.

ఉద్యోగ విరమణకు కొద్ది గంటలకు ముందు..

- అంగన్‌వాడీ కార్యకర్త మృతి



జయలక్ష్మి (ఫైల్)

టెక్కలి రూరల్: ఉద్యోగ విరమణకు కొద్ది గంటల ముందు ఓ అంగన్‌వాడీ కార్యకర్త మృతి చెందారు. ఈ సంఘటన చింతలగార గ్రామంలో చోటు చేసుకోగా.. మెండ జయలక్ష్మి (60) బుధవారం రాత్రి అనారోగ్యంతో తనువు చాలించారు. ఈమె గురువారం రిటైర్ కావాల్సి ఉంది. జయలక్ష్మి మృతిపై గ్రామస్తులు, అంగన్‌వాడీ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

ఐసీడీఎస్ పీడీ బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళం అర్బన్: స్త్రీ, శిశు సంక్షేమశాఖలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలను జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మరింత సమర్థంగా అమలయ్యేలా చూస్తానని స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి బగాది శాంతిశ్రీ అన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో శ్రీకాకుళం జిల్లాలో డీఆర్‌డీఏ పీడీగా రెండేళ్లు పనిచేశానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేసినట్లు తెలిపారు.

దిశా పోలీస్‌స్టేషన్ తనిఖీ



కేసుల వివరాలను డీఎస్పీని అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : స్టేషన్‌కు వచ్చే మహిళా ఫిర్యాదిదారుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకుని వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం శ్రీకాకుళం దిశా (మహిళా) పోలీసు స్టేషన్‌ను సందర్శించి పోక్సో కేసుల వివరాలను డీఎస్పీ ఎస్.వాసుదేవ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో స్టేషన్‌లోని సౌకర్యాలు, ముఖ్య రికార్డుల నిర్వహణ పరిశీలించి సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉమెన్ రిసెప్షన్ సెంటర్, కౌన్సిలింగ్ గది, వెయిటింగ్ షెల్టర్, పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలు, కళాశాలల వద్ద దిశ బీటు సిబ్బంది దిశా వాహనాలతో గస్తీ నిర్వహించి ర్యాగింగ్ అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమైన కేసుల దర్యాప్తుపై దృష్టి సారించాలని డీఎస్పీ వాసుదేవ్‌కు ఎస్పీ రాధిక సూచించారు. ఎస్‌ఐ చంద్రకళ, సిబ్బంది పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఎంతో మేలు

లావేరు: ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి అన్నారు. మండలంలోని బొంతువలస గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. వైద్యులు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. గ్రామంలోనే అందరికీ వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఈ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. ఆమెతో పాటు సీసీ నారాయణరావు, వైద్యురాలు డాక్టరు మణిభూషణ్, హెల్త్ అసిస్టెంట్‌లు ఆర్.శ్యామ్‌సుందర్, హెచ్‌వీ పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పీ భవానీ, ఏఎన్ఎం భవానీ, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

పాలిటెక్నిక్ తుది విడత కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ డిప్లమా ప్రవేశాలకు సంబంధించి తుది విడత ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ విడుదల చేసినట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, కౌన్సెలింగ్ సహాయకేంద్రం సమన్వయకర్త గురుగుబెల్లి దామోదర్‌రావు బుధవారం తెలిపారు. ఆన్‌లైన్ ఫీజులు చెల్లింపు, ఆప్షన్ల ఎంపిక సెప్టెంబర్ రెండులోపు పూర్తి చేయాలని అన్నారు. సెప్టెంబర్ 4వ తేదీన సీట్ల అలాట్ మెంట్, ఏడు లోపు కళాశాలలకు రిపోర్టు చేయాలని తెలిపారు.

● రక్షానుబంధం



పాతపట్నం: ఆకట్టుకున్న మోడల్ డిగ్రీ కాలేజీ విద్యార్థుల రాఖీ ఆకృతి



పాతపట్నం: ఎమ్మెల్యే రెడ్డి శాంతికి రాఖీ కడుతున్న డిగ్రీ కాలేజీ విద్యార్థులు



కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, అదనపు ఎస్పీలు విఠలేశ్వరరావు, తిప్పేస్వామిలకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

జిల్లాలో రాఖీ పౌర్ణమి వేడుక బుధవారమే మొదలైపోయింది. పలు చోట్ల బుధవారం నుంచి రాఖీలు కట్టారు. జిల్లా ప్రముఖులు, రాజకీయ నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి మరీ రక్షా బంధన ప్రత్యేకతను వివరించారు. బడుల్లో రాఖీ పండగ విశిష్టతను విశదీకరిస్తూ ప్రత్యేక ప్రదర్శనలు చేశారు. జిల్లాలో గురువారం కూడా రాఖీ పండగ జరగనుండడం విశేషం.



ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి రాఖీలు కడుతున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థినులు

పనుల్లో స్పీడ్.. మన వద్దే సీడ్

- అందుబాటులోకి రానున్న విత్తనోత్పత్తి కేంద్రం
- నందిగాం మండలంలో సిద్ధమవుతున్న సీడ్ సెంటర్
- జిల్లాలో 45వేల మంది రైతులకు మేలు



ప్రారంభానికి సిద్ధం అవుతున్న విత్తనోత్పత్తి కేంద్రం

నందిగాం:

రైతులను విత్తు విపత్తుల నుంచి తప్పించేందుకు నందిగాం మండలంలో విత్తనోత్పత్తి కేంద్రం స్పీడ్‌గా పనులు జరుపుకుంటోంది. జిల్లాలో ఎక్కువగా స్వర్ణ, సాంబమసూరి, 1061, 1064, ఆర్‌జీఎల్ 2537, సోనా మసూరి వంటి వంగడాలు వినియోగిస్తున్నారు. వీటి కోసం జిల్లా వ్యవసాయ అధికారులు తూర్పుగోదావరి జిల్లా తణుకు, చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి, తెలంగాణలోకి కరీంనగర్, హుజురాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లి విత్తనాలు సేకరిస్తున్నారు. ఇకపై జిల్లాలోనే ఆ విత్తనాలు అందుబాటులోకి రానున్నాయి. నందిగాంకు 2020లో మంజూరు చేసిన విత్తనోత్పత్తి కేంద్రం పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. నందిగాం మండలంలోని శివరాంపురం పంచాయతీ బడబందలో ఉన్న ప్రభుత్వ భూమి 5 ఎకరాలు కేటాయించడంతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ నిర్మాణ పనుల బాధ్యతను తీసుకుంది. మరో 40 రోజుల్లో ఈ కేంద్రం ప్రారంభానికి సిద్ధమవుతుంది.

ఇక్కడ కేంద్రం ప్రారంభమైతే విత్తనాల కోసం ఇతర జిల్లాలపై ఆధారపడాల్సిన అవసరం తప్పుతుంది. మొదటగా ఈ కేంద్రం ద్వారా రైతులకు ఫౌండేషన్ సీడ్ అందజేసి వాటి నుంచి వచ్చే దిగుబడిని ఈ కేంద్రంలో శుద్ధి చేసి మిగతా ప్రాంతాల రైతులకు విత్తనాలుగా అందించేందుకు ప్రణాళికలు తయారవుతున్నాయి. జిల్లాలో ఇదివరకే ఉన్న ఆంపోలు కేంద్రంతో పాటు ఈ కేంద్రం కూడా వినియోగంలోకి వస్తే రైతులకు వరితోపాటు వేరు శనగ విత్తనాలు కూడా నిరంతరం అందుబాటులోకి వస్తాయి. 20వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం పూర్తి చేసుకుంటున్న ఈ కేంద్రంలో 15వేల క్వింటాళ్ల విత్తనాలు నిల్వ ఉంచుకోవచ్చు.

రైతుకు అధిక ఆదాయం

విత్తనోత్పత్తి కేంద్రం పరిధిలోని రైతులకు కేంద్రం ఇచ్చిన ఫౌండేషన్ సీడ్‌తో పంటను వేసుకొని ఆ పంటను విత్తనాలుగా విత్తనోత్పత్తి కేంద్రాలకు అమ్ముకుంటే 25 శాతం అధిక ఆదాయం వస్తుంది. మామూలు ధాన్యం బస్తా కంటే విత్తనాల బస్తా ధర ఎక్కువగా ఉంటుంది. అలాగే ఫౌండేషన్ సీడ్ వేయడం వల్ల దిగుబడి కూడా అధికంగా ఉంటుంది. గార మండలం ఆంపోలులో ఉన్న కేంద్రం శ్రీకాకుళం, నరసన్నపేట పరిధిలోని పలు మండలాలకు విత్తనాలు అందిస్తే, నందిగాంలో ఉన్న ఈ కేంద్రం టెక్కలి డివిజన్ 45 వేల మంది రైతులకు, 75వేల ఎకరాల భూమికి కావాల్సిన సుమారు 23 వేల క్వింటాళ్ల విత్తనాలు తయారు చేసే స్థాయికి తీసుకువెళ్లేలా అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు.

జగనన్న ఇచ్చిన శాశ్వత కానుక



రాష్ట్రంలోనే విస్తీర్ణంలో అతి పెద్దదైన నందిగాం మండలంలో వ్యవసాయం మీద ఆధారపడే వారికి శాశ్వతంగా ఉపయోగపడేలా సీఎం వైఎస్ జగన్ కానుక ఇచ్చారు. దీని వల్ల రైతులకు మేలు జరుగుతుందని నమ్ముతున్నాం.

– పిన్నింటి శ్రీధర్, రైతు నందిగాం

రైతులను భాగస్వాములు చేస్తాం



విత్తనాల ఉత్పత్తి పెంచి ఈ జిల్లాలోని విత్తనాలు ఈ జిల్లాలోనే వినియోగించేలా రైతులను సంసిద్ధులను చేస్తాం. ఈ కేంద్రం ద్వారా ముందుగా ఈ ప్రాంత రైతులకు ఫౌండేషన్ సీడ్ అందించి అంచెలంచెలుగా మిగతా ప్రాంత రైతులను కూడా విత్తనాలు తయారు చేసే ప్రక్రియలో భాగస్వామ్యులు చేస్తాం. మరో 40 రోజుల్లో కేంద్రం అందుబాటులోకి వస్తుంది.

– పి.బాలకృష్ణ, ఏపీ సీడ్స్ శ్రీకాకుళం జిల్లా మేనేజర్

కాలేయ వ్యాధి బాధితుడికి కలెక్టర్ బాసట

సాక్షి ఎఫెక్ట్...



మంచానికే పరిమితమైన వెంకటరావు

జి.సిగడాం : తీవ్రమైన కాలేయ వ్యాధితో బాధ పడుతున్న సంతవురిటి గ్రామానికి చెందిన సవలాపురపు వెంకటరావుకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ బాసటగా నిలిచారు. వెంకటరావు పరిస్థితిపై ఈ నెల 30న సాక్షిలో 'మా నాన్నను బతికించండి' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన కలెక్టర్ బాధితునికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైద్యం కోసం అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ పి.ప్రకాశరావును ఆదేశించారు. హైదరాబాద్‌లో ఉన్న యశోద ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాలని కోరారు. ఇప్పటికే వెంకటరావు ఊరికి వెళ్లి రిపోర్టులు తీసుకున్నామని వెల్లడించారు.

పాతపట్నంలో భారీ అగ్ని ప్రమాదం



దుస్తుల షాపులో మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాతపట్నం: పాతపట్నంలో బుధవారం తెల్లవారుజామున స్నేహ షాపింగ్ మాల్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఇందుకు సంబంధించి స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, షాపు యజమాని తెలియజేసిన వివరాల ప్రకారం.. పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద స్నేహ షాపింగ్ మాల్ ఉంది. బుధవారం తెల్లవారు జామున ఈ షాపు షట్టరు కింద నుంచి పొగలు బయటకు రావటం అటుగా వెళ్తున్న వారు చూసి షాప్‌బోర్డుపై ఉన్న నంబర్‌కు కాల్ చేసి చెప్పారు. సమాచారం షాపు యజమానికి చేరడంతో అదే షాపులో మూడో అంతస్తులో ఉన్న యజమాని కుటుంబం అప్రమత్తమై పక్క నున్న మరో అపార్టుమెంట్ నుంచి బయటకు వచ్చారు. పోలీసులకు విషయం చెప్పడంతో వారు అక్కడకు చేరుకున్నారు. పర్లాకిమిడి, టెక్కలి అగ్నిమాపక కేంద్రాలకు ఫోన్ చేయడంతో ఆ రెండు వాహనాలు వచ్చి మంటలను అదుపు చేశాయి. షాపింగ్ మాల్ యజమాని షాపు తాళాలు మూడో ఫ్లోర్‌లోని తన ఇంటిలో వదిలేయటంతో షట్టర్లను కట్ చేసి లోపలకు వెళ్లి మంటలు అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందని, బాధితుడు తెలిపారు. ప్రమాదంలో షాపింగ్ మాల్‌లోని గ్రౌండ్ ఫ్లోర్, ఫస్టు, సెకండ్ ఫ్లోరుల్లోని దుస్తులు, టీవీలు, సీసీ కెమెరాలు, ఏసీలు, ఫర్నీచర్ ఇతర విలువైన సామగ్రి కాలిపోయాయని, రూ.5కోట్ల వరకు ఆస్తినష్టం జరిగిందని షాపు యజమాని దారపు ప్రసాద్ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహ్మద్ యాసిన్ తెలిపారు.

బాహుదాపై కొత్త వంతెనకు గ్రీన్ సిగ్నల్



వంతెన పరిశీలిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్:

బాహుదా నదిపై కూలిపోయిన పురాతన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. వంతెన కూలిపోయాక ఆంధ్రా–ఒడిశా ప్రాంతాల మధ్య ప్రజలకు కలిగిన ఇబ్బందులను గుర్తించిన జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌ల కృషి మేరకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ రూ.40 లక్షలు కేటాయించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. అదనంగా మరో రూ.20 లక్షలు కూడా ఇచ్చారు. ప్రస్తుతం వారం రోజుల నుంచి వాహనాల రాకపోకలకు అనుమతులు ఇచ్చారు.

ఫలించిన సాయిరాజ్ కృషి

ప్రస్తుతం వంతెనపై వాహనాల రాకపోకలు సాగిస్తున్నప్పటికీ 94 ఏళ్ల నాటి వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణానికి ఇటీవల నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. సానుకూలంగా స్పందించిన సీఎం వంతెన నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు పంపించాలంటూ జిల్లా అధికారులను ఆదేశించడంతో గత నెలలో సంబంధిత అధికారులు బాహుదా నది వద్దకు వచ్చి అంచనాలు వేశారు. బాహుదా నదిపై నూతన వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేసినట్లు బుధవారం జీఓ కాపీ తనకు అందినట్లు పిరియా సాయిరాజ్ ప్రకటించారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మితో పాటు ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, స్థానిక ప్రజలు సాయిరాజ్ కృషికి హర్షం వ్యక్తం చేశారు.

జీడి పరిశ్రమల నిరవధిక సమ్మె

కాశీబుగ్గ: జీడి పరిశ్రమ దారులమంతా కలిసికట్టుగా నిరవధిక సమ్మెకు దిగుతున్నామని పలాస కాష్యూ మాన్యుఫ్యాక్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్ ప్రకటించారు. పీసీఎంఏ కార్యాలయంలో బుధవారం కంపెనీల యజమానులంతా సమావేశం నిర్వహించారు. ఇటీవల పాట్నూరు బాలరాజు అనే పరిశ్రమదారుడు పరిశ్రమలో తరచూ జీడిపిక్కలు, జీడిపప్పు దొంగతనం జరగడం, సీసీ పుటేజీల వైర్లు తరచూ కట్ అవుతుండటంతో అనుమానం వచ్చి కార్మికులకు అడిగినందుకు, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అన్నందుకు యజమానిపై భౌతిక దాడికి దిగారని అన్నారు. పని ఇచ్చిన యజమానులపై దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని అన్నారు. ఈ తంతు కొలిక్కి వచ్చేంత వరకు పలాసతో పాటు పరిసర ప్రాంతంలో ఉన్న 400 పరిశ్రమలు నిరవధిక సమ్మెకు దిగుతున్నామని అన్నారు. కార్యక్రమంలో పీసీఎంఏ కార్యదర్శి పి.రవికాంత్, బెల్లాల నారాయణ, శాశనపురి మురళి, మల్లా భాస్కరరావు, పాట్నూరు బాలరాజు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'సమస్యలు ఉంటే తెలియజేయాలి'



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: బూత్ స్థాయిలో సమస్యలు ఉంటే తెలియజేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ రాజకీయ పార్టీలను కోరారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసన సభ నియోజక వర్గాల వారీగా ఈ నెల 28వ తేదీ నాటికి జిల్లాలో 18,07,713 ఓటర్లు ఉన్నాయన్నారు. ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు చేర్పులు, తొలగింపులు, ఫారం–6) 5152, తొలగింపులకు (ఫారం–7) 2644, దిద్దుబాట్లకు (ఫారం–8) 3324 ఫారమ్స్ స్వీకరించినట్లు వెల్లడించారు. పోలింగ్ స్టేషన్లు దూరంగా ఉన్నా, పాడైనా, అలాంటి వాటికి మార్పులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తొలగింపుల ప్రక్రియకు సంబంధించి బీఎల్ఏలకు సహాయం అందించాలని కోరారు. ఓట్ల తొలగింపులు, చేర్పుల్లో ఎలాంటి ఎలాంటి సందేహాలు అవసరం లేదన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కక్షిదారులందరూ సెప్టెంబర్ 9వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవాలని శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా కోరారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ లోక్ అదాలత్‌లో మోటారు ప్రమాద కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, ల్యాండ్ ఎక్విజేషన్ కేసులు, భూ తగాదాలు, బ్యాంకు కేసులు రాజీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌ను వినియోగించుకుని ఖర్చు లేకుండా కేసులు పరిష్కరించుకోవాలని, అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

● అమ్మకు అలంకరణ



శ్రావణ మాసం గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా కోటబొమ్మాళిలోని కొత్తమ్మ తల్లిని ఐదువేల గాజులతో బుధవారం రాత్రి అలంకరించారు. గురువారం భక్తులకు ఇబ్బందులు కలగకుండా దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు ఈఓ వాచకచర్ల రాధాకృష్ణ తెలిపారు. – కోటబొమ్మాళి

రూ. 54.98 లక్షలు దొంగ నోట్ల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న దొంగనోట్లతో సీఐ ఆదాం, ఎస్ఐ సత్యనారాయణ

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. 54.98 లక్షలు దొంగనోట్లు స్వాధీనం చేసుకున్నట్లు జేఆర్ పురం సీఐ ఎస్.ఆదాం తెలిపారు. ఆయన బుధవారం ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. చిలకపాలెంలో ఈ నెల 24న తుని ప్రాంతానికి చెందిన దుంగ వీరమణికంఠ అనుమానాస్పదంగా తిరుగుతుండగా గుర్తించి తనిఖీ చేశామని, అతని వద్ద రూ. 37 లక్షల దొంగనోట్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే ఈ నెల 29న పైడిభీమవరంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో రూ. 17.98 లక్షల దొంగనోట్లు దొరికాయని తెలిపారు. విజయనగరానికి చెందిన గనగళ్ల విజయ్‌కుమార్, కర్నాటకకు చెందిన కె.వెంకటరెడ్డిలను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కారు సైతం స్వాధీనం చేసుకున్నామని అన్నారు. కర్నాటక రాష్ట్రం నుంచి ఈ నోట్లు తెచ్చి ఇక్కడ చెల్లుబాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఒక నకిలీ రెండువేల రూపాయల నోటును రూ.500కు అమ్ముజూపుతున్నారని, ఇలాంటి వారి చేతిలో మోసపోవద్దని అన్నారు. సమావేశంలో ఎస్ఐ వి.సత్యనారాయణ ఉన్నారు.

క్లుప్తంగా

లైంగికదాడి కేసులో 20 ఏళ్ల జైలుశిక్ష

సంతబొమ్మాళి: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో మండలం కె.లింగూడు పంచాయతీ ఎం.సున్నాపల్లి గ్రామానికి చెందిన ఉప్పాడ సంతోష్ కుమార్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 20వేలు జరిమానా, బాధిత కుటుంబానికి రూ.లక్ష ఇవ్వాలని శ్రీకాకుళం పోక్సో కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. నౌపడ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 2019 ఫిబ్రవరి 16న గ్రామానికి చెందిన ఓ బాలికపై సంతోష్ లైంగిక దాడికి పాల్పడినట్లు నౌపడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కోర్టులో విచారణ అనంతరం సంతోష్ కుమార్‌పై నేరం రుజువు కావడంతో శిక్ష విధించారు.

సజావుగా జాబ్‌మేళా


మాట్లాడుతున్న జిల్లా ఉపాధికల్పనాధికారి కె.సుధ

శ్రీకాకుళం అర్బన్: జిల్లా నెహ్రూ యువజన కేంద్రం కార్యాలయంలో బుధవారం జాబ్ మేళా జరిగింది. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ పాల్గొని మాట్లాడారు. జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు.

'రైతుల త్యాగాలను గుర్తించాం'


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, చిత్రంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి

టెక్కలి: 'మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుతో మీ ప్రాంతమే అభివృద్ధి చెందుతుంది. మేము ఈ రోజు ఇక్కడ ఉంటాం. రేపు ఇంకో ప్రాంతానికి వెళ్లిపోతాం. పోర్టు కోసం భూములిచ్చి త్యాగం చేసిన వారు చరిత్రలో నిలిచిపోతారు. రైతుల త్యాగాన్ని గౌరవించాం. అందుకే పోర్టు రోడ్డు కోసం భూములిస్తున్న రైతులకు న్యాయపరంగా అత్యధికంగా పరిహారం ఇస్తున్నాం' అంటూ కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. పోర్టు రోడ్డు ప్రభావిత టెక్కలి మండలం బన్నువాడ, మోదుగువలస గ్రామాలకు చెందిన రైతులతో బుధవారం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి సమక్షంలో నిర్వాసిత రైతులతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ముందుగా నిర్వాసిత రైతులు మాట్లాడుతూ ఎన్నో తరాలుగా ఇదే భూములపై ఆధారపడి జీవిస్తున్నామని పేర్కొన్నారు. టెక్కలి ప్రాంతానికి ఇచ్చిన మాదిరిగా తమకూ పరిహారం ఇవ్వాలని అభ్యర్థించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజుల కిందట ఇదే రైతులు భూములిచ్చేందుకు పూర్తి స్థాయిలో సంతకాలు చేశారని, ఇప్పుడు మరో రకంగా మాట్లాడుతున్నారని గుర్తు చేశారు. రైతులందరికీ న్యాయం చేయాలనే ఆలోచనతో మార్కెట్ విలువ కంటే అత్యధికంగా ఎకరాకు రూ.33 లక్షలు చెల్లించేందుకు సిద్ధపడ్డామని కలెక్టర్ పేర్కొన్నారు. సంతకాలు చేసిన వారికి రూ.33 లక్షలు, సంతకాలు చేయని వారికి ముందుగా ప్రకటించిన పరిహారాన్ని అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ఇదే ఫైనల్ నిర్ణయమని, తక్షణమే భూముల్లో ఫ్లగ్ మార్కు వేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్సీ దువ్వాడ మాట్లాడుతూ పోర్టుతో తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే అభిప్రాయంతో మూలపేట, విష్ణుచక్రం గ్రామాల ప్రజలు ఎంతో సంతోషంగా గ్రామాలను ఖాళీ చేస్తున్నారని గుర్తు చేశారు. మీ అందరికీ న్యాయం చేయాలనే ఆలోచనతో అత్యధికంగా పరిహారాన్ని అందజేస్తున్నారని ఈ విషయంలో కలెక్టర్ ఆదేశాలను, తనను గౌరవిస్తూ అంగీకారం తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి మాట్లాడుతూ పోర్టు రోడ్డు కోసం భూములిస్తున్న రైతులంతా ఒక్కసారి భవిష్యత్ తరాల మంచి కోసం ఆలోచన చేయాలన్నారు. ఈ రోజు వేయనున్న రోడ్డు వల్ల మరికొద్ది రోజుల్లో బన్నువాడ, మోదుగువలసతో పాటు ఇతర నిర్వాసిత ప్రాంతాల్లో ఇతర ఆస్తుల విలువ మరింత పెరుగుతుందని ఆమె వెల్లడించారు.


సమావేశానికి హాజరైన పోర్టు రోడ్డు ప్రభావిత బన్నువాడ, మోదుగవలస రైతులు, అధికారులు

మత్తులో మానవత్వం చిత్తు

- స్వామీ వివేకానంద విగ్రహం ధ్వంసం చేసిన యువకులు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- యువకుల దుశ్చర్య వీడియో వైరల్


వివేకానంద విగ్రహంపై గుట్కా ఊస్తున్న యువకుడు

పొందూరు: ఒంటిపై ఒక్కరికీ సోయి లేదు. చుట్టుపక్కల ఏం జరుగుతోంది, తాము ఏం చేస్తున్నామో తెలీదు. మత్తులో జోగుతూ సమాజం ఛీ కొట్టేలా దుశ్చర్యకు పాల్పడ్డారు. యువతే దేశ భవిష్యత్ అని గొంతెత్తి చెప్పిన స్వామీ వివేకానందుడి విగ్రహాన్ని ధ్వంసం చేసి అపచారానికి పాల్పడ్డారు. ఆరు నెలల కిందట జరిగిన ఈ ఘటన తాలూక వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. వీడియోలో యువకులు ప్రవర్తించిన వైఖరి చూసి వీక్షకులంతా మండిపడుతున్నారు. మత్తు పదార్థాలను సేవించిన యువకులు ఆ మత్తులో పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న వివేకానంద స్వామి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. తాజాగా బయటకు వచ్చిన వీడియో ప్రకారం పొందూరుకు చెందిన ఓ వ్యక్తి అతని స్నేహితులు మత్తు పదార్థాలను సేవించి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న వివేకానంద స్వామి విగ్రహాన్ని కర్రతో కొడుతూ, విగ్రహంపై నమిలిన గుట్కా ఊస్తూ, ఇసుకను వేస్తూ, విగ్రహంతో మాట్లాడుతూ వికార చేష్టలు చేశారు. అంతటితో ఆగకుండా విగ్రహాన్ని తొలగించి రోడ్డుపై పడేశారు. ఇదంతా పలువురు యువకులు చూస్తూ ప్రోత్సహిస్తూ వీడియోలు తీశారు. దీనిపై అప్పట్లో పాఠశాల సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వలేదు. ఇప్పుడు వీడియో బయటపడడంతో ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.ఈశ్వరరావు ఆచారీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఈ ఘటనలో మొత్తం 11 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థినిపై హెచ్‌ఎం అనుచిత ప్రవర్తన

గార: మండలంలోని వమరవల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అదే పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న బాలికతో అనుచితంగా ప్రవర్తించినట్లు బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. రెండు నెలల కిందట సంతబొమ్మాళి మండలం నుంచి బదిలీపై వచ్చిన హెచ్‌ఎం కొద్ది రోజులుగా విద్యార్థినిని ఇబ్బంది పెడుతుండడంతో ఆమె తల్లిదండ్రులకు విషయం చెప్పింది. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా ఒకరు సెలవు పెట్టడంతో ఒక్కరే బాధ్యతలు చూసుకుంటున్నారు. అయితే బాలిక విషయం గ్రామపెద్దలు వరకు వెళ్లి హెచ్‌ఎంను మందలించారు. అయినా ఆయన మారకపోవడంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. బుధవారం శ్రీకాకుళం డీఎస్పీ వై. శృతి గార పోలీస్‌స్టేషన్‌లో విచారణ చేపట్టారు. సీఐ ఎస్.కామేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసు నమోదు అనంతరం ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రశాంత్

ఎల్.ఎన్.పేట: మండలం సమీపంలోని బప్పడాం రోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే మండలం మోదుగువలస పునరావాస కాలనీకి జి.ప్రశాంత్ మృతి చెందారు. సరుబుజ్జిలి నుంచి ఎల్.ఎన్.పేట మండలం మోదుగువలస కాలనీకి తన ఆటోతో ప్రశాంత్ వస్తున్నాడు. బప్పడాం రోడ్డు సమీపంలోని కల్వర్టు వద్ద గోతిలోకి దిగిన ఆటోను అదుపులోకి తెచ్చే ప్రయత్నంలో బండి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ ప్రసాద్ తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వటంతో 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతునికి భార్య, ఏడాదిన్నర వయసున్న కొడుకు ఉన్నారు. ఆటో బోల్తాపడిన సమయంలో ఆటోలో ప్రయాణికులు ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పింది. రోడ్డు ప్రమాదానికి సంబంధించి శ్రీకాకుళం ఔట్‌పోస్టు నుంచి ఫిర్యాదు వచ్చిందని సరుబుజ్జిలి పోలీసులు తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


బాలకృష్ణ మృతదేహం (ఇన్‌సెట్లో) బాలకృష్ణ (ఫైల్)

హిరమండలం: వంశధార కుడి కాలువలో పడి గల్లంతైన పాతపట్నం మండలం సీది గ్రామానికి చెందిన ఎం.బాలకృష్ణ మృతదేహం బుధవారం లభ్యమైంది. ఓ శుభ కార్యానికి మంగళవారం హిరమండలం వచ్చిన బాలకృష్ణ కాలువలో స్నానానికి దిగి గల్లంతైపోయారు. మంగళవారం ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు.

పోలీసులు గజ ఈతగాళ్లను తప్పించి కాలువలో ప్రవాహాన్ని తగ్గించి వెతకగా వంశధార కుడి కాలువ వంతెనకు సమీపంలో ఆయన మృతదేహం లభ్యమైంది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఎస్‌ఐ జి.నారాయణ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై.. ప్రాణాలు తీసుకున్నాడు


ఆత్మహత్యకు పాల్పడిన సాయికుమార్ (ఫైల్)

కోటబొమ్మాళి: స్థానిక మేజర్ పంచాయతీ ప్రకాష్‌నగర్‌కాలనీకి చెందిన డబ్బీరు సాయికుమార్ (28) బుధవారం ఉదయం తన ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయికుమార్ చిన్నతనంలోనే తండ్రి నాగేశ్వరరావు మరణించడంతో తల్లి లక్ష్మితో కలిసి తన మేనమామ కృష్ణపాత్రుని వెంకటరావు ఇంటిలో ఉండేవాడు. యువకుడు ఐటీఐ వరకు చదివాడు. వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై డబ్బులు ఇవ్వాలని తరచూ తల్లి, మేనమామలను వేధిస్తుండేవాడు. మంగళవారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఇంటి పక్కన గల పెంకుటింటిలో నిద్రపోయాడు. బుధవారం ఉదయం మేనమామ టీ ఇచ్చేందుకు తలపు తట్టగా తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు తెలిపారు. వారు వచ్చి చూడగా సాయికుమార్ ఇంటిపైకప్పునకు ఉన్న దూలానికి చీరతో ఉరివేసుకుని కనిపించాడు.

సాయికుమార్ మృతితో కాలనీలో విషాద ఛాయలు నెలకొన్నాయి. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ


మాట్లాడుతున్న పీఓ కిశోర్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: పంచాయతీ రాజ్ పాలనపై పూర్తి స్థాయి అవగాహన గ్రామ కార్యదర్శులకు అవసరమని జిల్లా శిక్షణ కేంద్రం పీఓ కిశోర్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులకు జరుగుతున్న ఆరు రోజుల శిక్షణ తరగతుల్లో భాగంగా, రెండో రోజు బుధవారం పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం గ్రామ సచివాలయం వేదికగా అనేక సేవలు ప్రజలకు అందుతున్నాయని అన్నారు. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందాలని చెప్పారు. ప్రధానంగా భవిష్యత్‌లో ఇంకా సేవలు విస్తరిస్తాయని తెలిపారు. పంచాయతీలకు ఆదాయం మార్గాలు తేవటం, ప్రజలకు మెరుగైన సేవలు అందించటం రెండు అంశాలు కీలకమని చెప్పారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పడ్డాక గ్రామాల్లో స్వపరిపాలన సాధ్యమైందని అన్నారు.

నలుగురు ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు

అరసవల్లి: పంచాయతీ రాజ్‌లో సీనియర్ పరిపాలనాధికారులుగా పనిచేస్తున్న నలుగురికి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీఓ)గా పదోన్నతులను కల్పిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా పరిషత్‌లో ఏఓలుగా పనిచేస్తున్న బి.బి.మిశ్రోకు బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు, ఎం.వి.రంగారావుకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎంపీడీఓలుగా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే జిల్లా నీటి యాజమాన్య సంస్థలో ఏఓగా పనిచేస్తున్న కె.వి.ప్రసాద్‌కు బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు, నరసన్నపేట మండలపరిషత్ ఏఓగా పనిచేస్తున్న ఆర్.తిరుపతిరావుకు ఏలూరు జిల్లాలో ఎంపీడీఓగా పదోన్నతి కల్పిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

గోమాతను కాపాడారు

కాశీబుగ్గ: కడుపు నిండా ప్లాస్టిక్ కవర్లను మింగేసిన గోమాతను స్థానికులు కాపాడారు. పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ పరిధిలో బుధవారం ఓ ఆవు కడుపు నిండా ఆహార పదార్థాలతో పారేసిన కవర్లను తిని రోడ్డుపై ఒరిగిపోయింది. దీంతో వెంటనే అక్కడున్న లేబర్లు, విద్యార్థులు స్పందించి రిక్షాపై గోవును సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం వైద్యులను పిలిపించి సెలైన్ ఎక్కించి వైద్య సేవలు అందించారు.

కనరో భాగ్యము

- సర్వకళల సమాహారం హరికథ
- రానురాను తగ్గిపోతున్న హరికథ కళాకారులు
- నేడు హరికథా పితామహుడు ఆదిభట్ల జయంతి

మీరు వందలాది కథలు చదివి ఉంటారు. వేలాది పాటలు విని ఉంటారు. ఆ రెండింటి 'కళ' గలుపు ఎప్పుడైనా చూశారా..? కథ చెబుతూనే రాగబద్ధంగా పద్యం అందుకునే ప్రావీణ్యం గుర్తించారా..? అంతలోనే సన్నివేశానికి తగ్గ గానం రాగం తప్పకుండా రావడాన్ని ఆస్వాదించారా..? సన్నివేశం జరుగుతుండగానే వెనుక నేపథ్య సంగీతం మన మనసును వారి ఆధీనంలోకి తీసుకెళ్లిపోవడాన్ని గమనించారా..? లేదంటే మీరోసారి హరికథ చూడాల్సిందే. సినిమాలు, ఓటీటీలకు అలవాటుపడిపోయిన మనసుకు కాసింత మార్పు కావాలంటే హరికథాగానం వినండి. నేడు హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు జయంతి.


హరికథాగానం చేస్తున్న దృశ్యం(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: భళా అనిపించే హావభావాలు, భేష్ అనిపించే రాగతాళాలు, అబ్బురపరిచే నాట్య విన్యాసాలు.. ఇన్నింటి కలగలుపు హరికథ. అతి ప్రాచీన జానపద కళారూపమైన హరికథాగానం ఇప్పుడు నిరాదరణకు గురవుతోంది. ఈ కళా విన్యాసాన్ని హృదయ రంజకంగా తీర్చిదిద్దిన ఘనత హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసుకే చెందుతుంది. అందుకే ఆయన హరికథా పితామహుడయ్యారు. కొన్ని గంటల సమయంలో పురాణ కథను, కీర్తనలు, పద్యము, మంజరి, తోహరా, వచనాలతో రసవత్తరమైన గాన, తాళ, భావ, యుక్తమైన పరిపూర్ణ ఆధిపత్యంతో నవరస భరితంగా ప్రదర్శించగల గంధర్వుడు ఆదిభట్ల. అందుకే ఆయనకు గుర్తుగా జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో ప్రముఖ కళాభిమాని డాక్టర్ నిక్కు అప్పన్న నారాయణదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

సిక్కోలులో..

సిక్కోలు హరికథ కళాకారుల్లో ఈశ్వర సత్యనారాయణ శర్మ ప్రథములు. ఈయన శర్మద రామాయణం, భక్తనందనార్, సతీసులోచన, వామన చరిత్ర, లక్ష్మీవిజయం, త్యాగరాజ, శ్రీనివాస కల్యాణం, సతీ పరిణయం రచించారు. అలాగే హరికథలపై పరిశోధన గ్రంథాన్ని రచించి బరహంపూర్ యూనివర్సిటీకి సమర్పించిన డాక్టరేట్ పొందారు డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు. ఇంకా ఎందరో హరికథా గానం చేస్తు జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తెచ్చారు.

ప్రస్తుతం సుమిత్రా కళాసమితి ఏటా హరికథా సప్తాహం నిర్వహిస్తూ కళ కోసం అవిరళ కృషి చేస్తోంది. సీనియర్ భాగవతార్‌లలో ఒకరైన దివంగత దూసి బెనర్జీ భాగవతార్ హరికథలతో మెప్పు పొందారు. ఆంగ్లంలో హరికథను నాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఎదుట పది నిమిషాల పాటు 'సీతా కల్యాణం' గానం చేసి ప్రశంసలు పొందారు. సీనియర్ హరికథకులు బుసకల రంగారావు భాగవతార్ మంచి కథకులు. ఈయన జిల్లా ఖజానా కార్యాలయంలో పనిచేశారు. వీరితోపాటుగా శారదాంబ భాగవతారిణి, మీనాక్షి భాగవతారిణి ఈ కళకు ఇంకా ఊపిరిపోస్తున్నారు.

టీటీడీ ప్రోత్సాహం ఉంది

టీటీడీ ఇంకా మాలో ఉత్సాహం కలిగిస్తోంది. హరికథా మహోత్సవాలు ఏటా మజ్జాడ ఆదినారాయణదాసు పేరున నిర్వహించి, హరికథలను ప్రోత్సహించాలి. – బి.రంగారావు భాగవతార్

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220